

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 18 డిసెంబర్, 2021 సంచిక : 7

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ ఎం. సత్యనారాయణ M.Tech.
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**

| | |
|---|---|
| ద్వైవార్షిక చందా. ......... | రూ॥ 200/- |
| ఆజీవ సభ్యత్వం .......... | రూ॥ 1000/- |

**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
బ్రహ్మానందం ........ 5
Fantasy ........ 10
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 11
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 14
సాయిభక్త దాసగణు ........ 16
శాశ్వత ధర్మగోప్త ........ 19
బాలవాణి-నరసింహావతారం ........ 22
ద్వారవతిలో పూర్ణిమనాడు ........ 24
పరిప్రశ్న ........ 25
సాధనా మార్గము ........ 27
శారదా స్తుతి ........ 28
పని కోసం శరీరం ........ 29
మాతృసంస్థ కబుర్లు ........ 30

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.









# మా వాణి

**ప్రియ సాయి మిత్రులందరికీ శ్రీ సాయిరక్ష!**

శ్రీ సాయినాథుల వారి పూజా విధానంలో హారతులు అనేవి ఒక విశిష్టస్థానాన్ని పొందాయి. కాకడహారతి (మేలుకొలుపు), మధ్యాహ్నహారతి (ప్రధాన నివేదనతోపాటు చేసేది), సాయంహారతి (సంధ్యా హారతి, శేజారతి(ఉయ్యాలసేవ) ఇలా నాలుగువేళల్లో హారతులనేవి షిరిడీ సంప్రదాయంగా ఏర్పడ్డాయి. బాబావారు (ద్వారకామాయి) మసీదులో నివసిస్తుండేవారు. ముస్లింలకు రోజులో ఐదుసార్లు నమాజు చేయడం విధాయకం."వారికేదో ఒక పద్ధతిఉంది. మనం కూడా ఏదో ఒక ప్రత్యేక విధానాన్ని, సమయాలను పెట్టుకుంటే బాగుంటుంది"- అన్న ఉద్దేశ్యంతో హిందూ భక్తులు హారతులివ్వడం ప్రారంభించారు. అది అలా స్థిరపడిపోయింది.

ఇందులో ఉన్న వాటిలో ఎక్కువభాగం భీష్మేశ్వర జోగ్, దాసుగణు, ఉపాసనీ మహరాజ్ మొదలైన మహాభక్తులు రచించినవి. వేకువజామున 5 గం.లకు (కొన్నిచోట్ల 5.15 గం.లకు) ప్రశాంత వాతావరణంలో రాత్రి నిద్ర వలన హాయిగా, తాజాగా ఉన్న మనస్సులతో పాడే మేలుకొలుపులు అద్భుతమైన అనుభూతిని కలిగిస్తాయి. భావనాపరంగా కూడా ఈ హారతి అతి సున్నితంగా హృదయాలను కరిగిస్తున్నట్లుగా ఉంటుంది. రహమ్ నజర్ కరో అబ్‌మోరే సాయీ, తుమ్ బినా నహీముఝే మా బాప్ భాయీ అన్నా, 'ఖాళీ జమానా మైనే గమాయా సాథీ అఖర్‌కా కియానా కోయీ' అన్నా గుండె కరగక మానుతుందా? 'ముఝ్‌సే ప్రభు దిఖ్‌లానా' అనగానే ఆ దీనత్వం మనస్సును తాకకుండా ఉంటుందా? ఉపాసనీ బాబా రచించిన సాయినాథ స్తవంలోని 'భవద్దర్శనాత్ సంపునీతః ప్రభోహమ్

అన్న పలుకులు పెదువులు మీదికి రాగానే ఏదో తెలియని ఒక నిశ్చింత కలుగుతుంది. 'షిరిడి మాఝే పండరపూర' అన్న పాట-దాని రాగంలాగానే- మన లోపల ఏదో ఉత్సాహం నింపుతుంది. నమస్కారాష్టకంలోని 'ధరావే కరీసావ అన్నది మనలోని పసితనాన్ని, ఆత్మార్పణ భావాన్ని పైకి తేగా- చివరి భాగం 'తులామాగతో' భక్తి వినమ్రుల్ని చేస్తుంది. ఇలా అడుగడుగునా అమృతమయమైనవే ఈ హారతులన్నీ.

అసలు హారతులు రచించిన వారంతా ఎంతో ఆర్తి, ఆర్ద్రత నింపుకొని రచించారు. అందుచేత పాడేవారు కూడా వాటికి తగిన గౌరవాన్ని నిలుపుతూ ఉండటం అవసరం గదా!

హారతులు పాడడానికి ముందు మనం చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే-మనం పాడేది సాయిబాబా కోసం. వినవలసిన అసలు వాడి మీదే మన దృష్టి నిలపాలి. స్వయంగా సాయిబాబా ఎదుట ద్వారకామాయిలో నిలబడి పాడుతున్నాం. అలనాటి భక్తులతో కలిసి పాడుతున్నాం-అన్న లోతైన భావనతో పాడాలి. ముఖ్యంగా పాటలలోని భావన మన హృదయాన్ని తాకుతూ ఉండాలి. అసలు నిజం చెప్పకోవాలంటే భావనతో ఒక్కపాట-ఒక్క పాటేమిటి-ఒక్క చరణం పాడినాగానీ మనసు ఆర్ద్రమై, కంఠం రుద్ధమై మరో చరణం పాడగలమా? "నా తల్లిదండ్రులు కోపించినా సరే-నా భార్యాబిడ్డలు కోప్పడినా సరే నా తోబుట్టువులు, అత్తమామలు అలిగినా సరే నా తండ్రీ సాయినాథా, నీవు మాత్రం నాపై కోపగించుకోకు స్వామీ!" ఈ మాటలు మన నోటితో పలకగానే ఏదో తెలియని దుఃఖం లోపలినుంచీ తన్నుకువస్తుంది. కంఠం రుద్ధమైపోతుంది. ఇక ఆ తరువాతి శ్లోకం ఎలా చదవగలం! ఎంతో కష్టం మీద నిగ్రహించుకొని ముందుకు సాగవలసి వస్తుంది. ఇలా మనసు మెత్తబడటమే హారతుల ప్రయోజనం. అది కావాలంటే గట్టి భావన ప్రధానం.

కొంతమంది "మరాఠీ హారతులే పాడాలని ఏముంది? మన భాషలో మనం పాడుకోవచ్చు గదా!" అంటారు. కొన్నిచోట్ల తెలుగు హారతులే పాడుతున్నారు కూడా. అయితే-యీ మరాఠీ హారతులు స్వయంగా సాయి







నాథుల వారి ముందు భక్తులు పాడినవీ, బాబా విన్నవీను. ఆయా రచయితలు స్వయంగా సాయిని .. వించినవారు. వీటన్నిటినీ మించి కొన్ని లక్షలు, కోట్లమంది భక్తులు దాదాపు వందేళ్లుగా యీ పాటలు భక్తి భావనతో పాడి పాడి వీటికి పుటం పెట్టి, వన్నె తెచ్చారు. వారి భక్తి ఆ పాటలకు ఎంతో పవిత్రతను సమకూర్చింది. అంచేత ఆ పాటలు పాడటం ఎంతో ఉచితం. అర్థం తెలియాలంటే షిరిడీ వారి 'సగుణోపాసన' చివర ఉన్న తాత్పర్యాలొక్కసారి చదువుకొంటే సరిపోతుంది.

మొత్తం మీద ఫలితార్థం ఏమిటంటే-ప్రియ సాయి భక్తులారా, హారతులను ఆర్తితో, భక్తితో బాబా పట్ల గొప్ప అనురక్తితో పాడితేనే అవి సత్ఫలితానిస్తాయి. అలా కాకపోతే-టేప్‌రికార్డర్‌కూ, మనకూ తేడా ఏమీ ఉండదు. సాయి ముందు అలనాటి షిరిడీ ప్రజల్లాగే ప్రేమభక్తులతో హారతులు పాడుదాం.

# మాతృసంస్థ కబుర్లు

**(32వ పేజీ తరువాయి)**

పాఠశాలలో అన్నింటిలో మొదటిస్థానంలో ఉంటూ, పాఠశాలకు ఆదర్శంగా ఉన్న చి॥ డి.భార్గవికి "బెస్టు స్టూడెంట్" అని తల్లిదండ్రుల సమక్షంలో సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయ బృందానికి పాఠశాల జ్ఞాపికను అందించారు.

ఈ కార్యక్రమంలో ఆర్థికంగా, హార్థికంగా సహకరించిన వారందరికీ, ప్రత్యేకంగా పాఠశాల ఉపాధ్యాయులకు శ్రీ సాయిబాబా వారి, గురుదేవుల, మాతాజీ ఆశీస్సులు ఎప్పడూ వారి వెన్నంటి ఉండాలని సాయివాణి మనసారా కోరుకుంటున్నది.

నవంబర్ 27న గద్వేల్ ప్రజ్ఞాపూర్‌లోని కార్తీక లక్ష దీపోత్సవ కార్యక్రమానికి శ్రీ శ్యాంశర్మగారి ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ శ్రీరామానంద ప్రభుజీ వారు హాజరయినారు. దీపోత్సవ కార్యక్రమ విశిష్టతను, భారతీయ సనాతన సంప్రదాయాన్ని వివరించారు.

# బ్రహ్మానందం

- వి.ఎస్.ఆర్. మూర్తి (అంతర్ముఖమ్ నుండి)

హిరణ్యగర్భానందము అని ఒక చిట్టచివరి స్థాయి ఒకటి ఉన్నది. ఈ హిరణ్య గర్భానందంలో అది పూర్ణం. అది జ్ఞానం. అక్కడ విచక్షణ లేదు. వస్తువు ఉన్నదా లేదా ఏమీ ఉండదు. ఈ హిరణ్యగర్భానందంలో పరమేశ్వరుడి యొక్క ఆనందంలో మనం భాగమై ఉంటాం. ఆ పరమేశ్వరానందంలో ఎప్పడయితే మనం భాగం పంచుకున్నామో, హిరణ్య గర్భానందానికే మరొక పేరు బ్రహ్మానందం. ఆ బ్రహ్మానందమే మనకు పరమమైన, చరమమైన సుఖాన్ని, శాంతిని, ఆనందాన్ని ఇస్తుంది. వస్తుపూర్వకమైన ఆనందం మనకి ఆనందం కాదు. వస్తువుతో కూడిన ఆనందం వస్తువుతో పోతుంటే, శరీరంతో పొందిన ఆనందం శరీరం పోగానే పోతుంది. ఈ శరీరం పోయేది కాబట్టి ఈ ఆనందం కూడా పోయేదే! పోయే ఆనందం మనకి అక్కర్లేదు. నిలకడ చెందే ఆనందం మనకి కావాలి. నిలకడ చెందే నిత్య, సత్య శాశ్వతానందం ఎక్కడ ఉన్నది?

'అది హృదయైక వేద్యం. అది లోపల ఉంటుంది అన్నారు. లోపల ఎట్లా ఉంటుందంటే, శిరిడీ బాబా 'ఊది' అనేవారు. ఊదిని ఇస్తున్నప్పడు ఏం చెప్పే వారంటే ఏదో నేనిస్తున్నానని మీరనుకోకండి. మీ శరీరాన్ని యజ్ఞవాటిక చెయ్యండి. మీ హృదయాలన్నీ హోమగుండం చెయ్యండి. ధుని చెయ్యండి. దానిలో అజ్ఞానము అనేటటువంటి దానిని సమర్పిస్తూ ఉండండి. అజ్ఞానము అంటే జ్ఞానం లేకపోవటం మాత్రమే కాదు. జ్ఞానం గురించి తెలియకపోవటం కాదు, అజ్ఞానమంటే ఏమిటో తెలియక పోవటం కూడా అంతే అజ్ఞానం. కాబట్టి అజ్ఞానమనేటటువంటి ఆలో చనలు, వికారాలతో కూడినటువంటి ఆలోచనలు, ప్రాపంచికమైనటు





సాయి వాణి

వంటి ఆలోచనలు, భోగలాలసను పెంచే ఆలోచనలు మనసులో రాగానే, మీ హృదయము అనేటటువంటి ఆ ధునిలో వెయ్యండి. దానిలో మీరు వివేకము అనేటటువంటి నేతిని వెయ్యండి. అప్పడు మీ చేతికి వచ్చేది జ్ఞానము అనే విభూతి. అదే ఇవాళ మనకు స్వామి సృష్టించి ఇచ్చినా, చేతితో ఇచ్చినా, విభూతి మంత్రం మనకు నేర్పినా, దీని వెనుక ఉన్నటు వంటి రహస్యమేమిటంటే, మన కర్మలన్నీ నశించగా, మన వికారాలన్నీ సమసిపోగా, మన శరీరభావనలు తగ్గిపోగా, మనం శరీర అవస్థ దాటిపోయిన స్థాయిలో మన మనస్సు నిలకడ చెందినప్పడు మనలోపల కలిగేటటువంటి ఆలోచనలన్నీ కూడా విభూతిమయంగా ఉండాలి అని. ఆ స్థాయికి వెళ్లినప్పడు మాత్రమే నిజమైనటువంటి శాంతి దొరుకుతుంది.

మిగతావి మనకు ఎండగా ఉంది . ఎ.సి. వేసుకున్నామంటే శాంతి దొరకలేదు. హాయి దొరికింది. అంతే! అది కొంతసేపే ఉంటుంది. శాంతి వేరు, హాయి వేరు, సుఖం వేరు, సంతోషం వేరు, అనుకూలత వేరు. అలాగే దుఖం లేకపోవటం ఒక్కటే సుఖం కాదు. సుఖం ఎక్కువ కావడం కూడా దుఖమే. సుఖం ఎక్కువయితే దు:ఖానికి దారితీస్తుంది. కాబట్టి పరిమితంగా ఉంచుకోండి. ఎంతవరకు కావాలో అంతవరకు సుఖించండి. ఎంతవరకు అవసరమో అంతవరకే మనసుని ఆలోచనలతో నింపండి. తక్కువ ఆలోచనలు ఉంటే ఎదగటానికి అవకాశం ఉంటుంది. ఎక్కువ ఆలోచనలతో మనసు బరువెక్కితే శరీరం కూడా బరువెక్కు తుంది. బయట నించి ఇన్ని ఆలోచనలు వస్తే మనసుకి శాంతి ఎక్కడ నించి వస్తుంది? మనసుకు శాంతి కూడా కావాలే! హృదయస్థానం వైపు నడిచే ఒకానొక ప్రయత్నం చెయ్యాలి. ఆ ప్రయత్నానికి శాస్త్రాలు దూరం ఉంటై. మనకి అన్నీ అర్థం కావు. మనకు అర్థం కాని భాషలో ఉంటై. మర్మగర్భంగా ఉంటై. కొన్ని చెప్పీ చెప్పక ఉంటై. కొన్ని చెప్పినట్లుగా ఉంటై. మరి వీటిని విడమరచి మనకు చెప్పేటటువంటి ఒక గురుస్వరూపాన్ని

మనం ఆశ్రయించాలి. ఆ గురువు ముఖత: మనం చక్కగా మన సందేహాలన్నీ సమాధాన రూపంలో పటాపంచలు చేసుకున్నట్లయితే, ఈ హృదయాన్ని శిరిడీ బాబా చెప్పినట్లు, ధుని చేసుకోగలిగినట్లయితే ఎంత సింపుల్‌గా చెప్పారో చూడండి, "మీరు బయట యజ్ఞవాటిక, యజ్ఞ గుండం పెట్టి చేసేదంతా ఒక క్రతువే. కానీ, లోపల మీ హృదయాన్ని గనుక ధుని చేస్తే, దానిలో ఒక్కొక్క ఆలోచనా ఒక్కొక్క సమిధవలె సమర్పించి నట్లయితే, వివేకాన్ని, విచక్షణని అగ్నిగా మార్చుకోగలిగినట్లయితే, దానితో కాల్చగలిగినట్లయితే జ్ఞానమనే విభూతి మీకు లభిస్తుంది" అని.

మనం అనుకుంటాం, ఇవాళే బజారు వెళ్ళాం, ఇవాళే బాబా ఫొటో తెచ్చుకున్నాం, ఇవాళే మనింట్లో పెట్టేసుకున్నాం. రేపటినుండీ మన జీవితం, వాతావరణం ఇట్లా అన్నది అట్లా మారిపోవాలి, తిరగబడ్డ విస్తరి మామూలు కావాలి అని అనుకుంటాం. స్వామి చెబుతారు. "నీవు కట్టెను తీసుకో. తీసుకొని దాని చివర ఒక గుడ్డపేలిక కట్టు. దానిని నూనెలో ముంచు. దాన్ని వెలిగించు. గుడ్డ ఉన్నంతసేపూ అది వెలుగుతుంది, వెలుగుతూ వెలుగుతూ కట్టెను చివరి దాకా నిప్పగా మారుస్తుంది. ఆ నిప్ప పూర్తిగా బూడిద కావటానికి కొంత సమయం పట్టదా? అట్లాగే నీవు భగవధ్యానంలోకి వచ్చినా, భక్తి మార్గంలో ప్రవేశించినా, గురు సన్నిధానంలో నిలకడ చెందినా, గురువుతో కూడి సంచారం చేసినా, గురు బోధనలు నీవు అసంఖ్యాకంగా ఎన్నోవిన్నా, ఏ శరీరం అనే ఈ కట్టెకి భక్తి అనే గుడ్డను చుట్టు, కర్మ అనే నూనెలో దానిని ముంచు. వివేకము, జ్ఞానము అనేటటువంటి దీపంతో దానిని వెలిగించు. ఆ కట్టెని మర్చిపో! ఏమవుతుంది? నెమ్మదిగా నెమ్మదిగా బొటనవేలి దాకా వస్తుంది. పట్టుకుని ఉంటాం. ఆ క్షణంలో ఆ కట్టెని వదిలేస్తాం. ఒదిలేసినా సరే దానికి ఉన్నటువంటి నిప్ప ఆ కట్టెనే అంటిపెట్టుకొని ఉన్నది కాబట్టి, నెమ్మదిగా అది ఎట్లాగయితే తన స్థితిని, తన స్వరూపాన్ని తనకున్నటువంటి శక్తినీ అన్నింటినీ కోల్పోయి, చిటికెడు బూడిద ఎట్లా అయిందో, నీ తనూ





భావాన్ని కూడా జ్ఞానాగ్నిలో దగ్ధం చెయ్యి, జ్ఞానాగ్నిని నిరంతరం ఆహ్వానం చెయ్యి.

నేనెందుకు వచ్చానన్న ప్రశ్న వేసుకో. ఈ మానవ జీవితంలో నేను సాధించవలసినది ఏమి? నా లక్ష్యం, చేరవలసినటువంటి గమ్యాలు ఏమిటి? మన లోపల పరమేశ్వరుడు కాంతిస్వరూపుడై ఉన్నాడని, చరాచరమయంగా శ్రీమయంగా, జ్యోతిర్మయంగా, వాఙ్మయంగా, పరాత్పర మయంగా, మన లోపలే సంచారం చేస్తున్నాడనీ, చేస్తున్నదనీ ఆ జ్యోతి దర్శనభావన గనుక మనకు ఉన్నట్లయితే, మన లౌకికమైన వ్యవహారాలన్నీ ముగించుకున్న తరువాత, మన మనస్సునీ మన లోపలికి మరల్చుకో గలిగినట్లయితే, మన లోపలికి తిప్పకొని తక్కువ ఆలోచనలతో ఎక్కువ సమయం గడపగలిగినట్లయితే, చిదానందమంతా మనకి కలిగి తీరుతుంది.

నిశ్చలమై, కళంకములేని నిర్మలమైన నిశ్శబ్దమయమైన ఒకానొక స్థాయిలో నీ మనస్సనే శబ్దాన్ని, ఆ నిశ్శబ్దంలో వుంచగలిగినట్లయితే అక్కడ నీకు ఒక చిన్న బిందు దర్శనం అవుతుంది. ఆ బిందు దర్వనం తరువాత జ్యోతిర్మయి దర్శనం అవుతుంది. స్వామి చెప్పే జ్యోతిధ్యానం అదే. ఆ జ్యోతిధ్యానానికి అనేక కిరణాలున్నై. అనేక కిరణ సమూహాలున్నై. వాటిన్నింటికీ నీవు ఈ వివేకము, విచారణ, శాస్త్రము, పాండిత్యము, లోకానుభవము, శాస్త్ర పరిచయము అనేకమైనటువంటి కర్మలు వీటన్నింటినీ వివేకంతో, దానితో అనుసంధానం చేయగలిగినట్లయితే, అంటే లోపల ఉన్న వెలుగుతో నీవు కూడగలిగినట్లయితే నీవు తరించిపోతావు. ఆనంద దాయకమవుతావు. ఆనందము చేత తరింప బడతావు. ఆ ఆనందం చేత తరింపబడినప్పడు నీలోపల దుర్గాటవిది వున్న అంటే కదంబవనం వుంది. మన లోపలే ఆ కదంబవనంలోకి మనంతట మనం ప్రవేశిస్తాం. ఆ ప్రవేశించినప్పడు ఇంకా మన లోపల ఎక్కడో ఉన్నటువంటి రెసిడ్యువల్ యానిమల్ ఇన్‌స్టింక్ట్ ఏవయితే ఉన్నాయో లాలస, భోగము, అసూయ,

అశాంతి, క్రోధము ఇవన్నీ కూడా పశులక్షణాలు కాబట్టి ఇవన్నీ ఒక మనో మృగరూపంలో ఉంటై. అక్కడిదాకా వెళ్ళిన వాడికి కూడా మనోమృగము పొంచి ఉంటుంది. ఆ ఆనందతారక స్థితిని అనంత కోటి గురుస్వరూపాలు మనందరకు అనుభవమయ, అనుభూతిమయ విభూతిగా అనుగ్రహించుగాక. అన్న ప్రశ్నలు వేసుకో... లేకపోయినట్లయితే నేను బాబా భక్తుణ్ణి కాబట్టి కష్టం రాకూడదనో, నేను బాబా భక్తుణ్ణి కాబట్టి నేననుకున్నట్లే జరగాలనో అనుకోవటం మన అజ్ఞానానికి సంకేతం. ఎందుకంటే మనం మన వాళ్ళకు కావలసినవన్నీ కావలసినట్లుగానే ఇస్తున్నామా? లేదు. మనకు నచ్చినవి, మనం ఇవ్వాలనుకున్నవి, ఎంత ఎప్పుడు ఇవ్వాలనుకున్నదీ మనం నిర్ణయించి ఇస్తున్నాం. మనకు మాత్రం, భగవంతుడు మనం ఏదడిగితే, ఎప్పుడడిగితే అప్పుడు ఎందుకు ఇస్తాడు? ఆశించకూడదు. ఎందుకంటే అసహజం కాబట్టి. పరమాత్మ మనకి దు:ఖాన్ని ఇచ్చేది ఇవ్వడు. మనకి ఏది ఆనందాన్ని ఇస్తుందో, మనకి సుఖాన్ని ఇస్తుందో, సౌఖ్యాన్ని ఇస్తుందో, ఎక్కడ మన మనసు శాంతి చెందుతుందో అటువంటివి మాత్రమే ఇస్తాడు. మనం అనుకుంటాం, ఓ పని పెట్టుకుంటాం, ఆ పని అనుకున్న దానికంటే లేటు అవుతూ ఉంటుంది. భక్తులమే! స్వామి మనతోనే ఉన్నారు. అయినా ఆలస్యమవుతున్నది. అయినా ఆలస్యమెందుకు అవుతున్నది? కాకూడదే! అంటే స్వామి లేరా? అంటే స్వామికి ఇష్టం లేదా? అని అనుకుంటాం. అది అలా జరిగితే దు:ఖం కాబట్టి ఆ రిజల్టు ఏమిటో ఆయనకి ముందే తెలుసు కాబట్టి ఆ దు:ఖనివారణ చేస్తారు. ఏది ఎప్పుడు, ఎట్లా జరిగితే ఈ జీవికి ఆనందం కలుగుతుందో, దాని ప్రకారం స్వామి నిర్ణయం చేస్తారు. అది గురువు యొక్క ప్రధానమైనటువంటి లక్షణం. ఆ గురు లక్షణాన్ని గనుక మనం స్వీకరించగలిగినట్లయితే, దానికోసం కాస్త ఎదురుచూడగలిగినట్లయితే అన్ని విషయాలూ మనవైపే వస్తాయి.





# FANTASY

*- A Krishna Mohan*

The world is the Fantasy of God and God is the Fantasy of the world. Every thought comes under the ambit of fantasy. Fantasy is our nature because it is god's nature also.

Your nature is fantasy - Transformation is fantasy.

Meditation is fantasy - Desire is fantasy .

Liking is fantasy - Disliking is fantasy.

Bondage is fantasy - Liberation is fantasy.

Birth is fantasy - Death is fantasy.

Dharma is fantasy - Adharma is fantasy .

You should be in one fantasy or another you choose a fantasy and change it from time to time. You cannot be otherwise.

You yourself are fantasy of some one whom we call God or original cause about whom we don't know anything. Hence we imagine about him or that and sky is limit for it. Since every body is free to imagine about which one does it know anything we have so many theories on God or that.

Leave all other's imagination and hold on to your own. We have no freedom at all. All acts and incidents in the universe happen according to the fantasy or Sankalpa of the unknown God or that, which we may call *Mahasankalpa or Easwaretcha*. We are depending on *Mahasankalpa*. Feeling that doing or not doing is really the ignorance of that *Mahasankalpa*. This is the truth. Truth has nothing to do with your understanding or otherwise it does on and on and on and ....

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

కపట గురువులు, స్వామీజీలు, బాబాల సంఖ్య నానాటికీ పెరిగిపోతోం దని అమాయక ప్రజలు వీరి వలలో పడి తమ అమూల్యమైన సమయాన్ని వృధా చేసుకుంటున్నారని ఈ కపట గురువుల వల్ల అసలైన గురువులు తమ ఉనికినే కోల్పోతున్నారని వాపోయేవారు మన స్వామీజీ.

కొంతమంది బాబాకు కుల మతాలను ఆపాదిస్తే మరికొంతమంది బాబాకు ప్రాంతీయతత్వాన్ని కూడ అంటగడుతున్నారనియు దీనికి ఉదా హరణ బాబా అన్నం వండి అన్నదానం చేసారు. కాని రొట్టెలు చేసేవారు కాదు కాబట్టి బాబా దక్షిణ భారత ప్రాంతానికి చెందినవారని వాదించే వారిని చూసిన స్వామీజీ కుల, మత, ప్రాంతాలకు అతీతుడైన సాక్షాత్తూ పరబ్రహ్మ స్థాయికి కూడ ఈ బాధ తప్పలేదని మథనపడే వారు మన స్వామీజీ.

**స్వామీజీ ఆశీస్సుల బలం :**

మన పూజ్య స్వామీజీ ఆశీస్సులతో మన దేశములో అనేక నగరాల లోను, పట్టణములలోను, పల్లెలలోనేగాక విదేశాలలో సహితం అనేక సాయి మందిరాలను నిర్మించారు స్వామీజీ భక్తులు. మందిర నిర్మాణ సమయం లోనూ, ఆ తరువాత మందిరంలో జరుపవలసిన నిత్య కార్యక్రమాలను స్వామీజీ వారికి ఎంతో విపులంగా వివరించేవారు.

స్వామీజీ ఆశీస్సులతో రెండవ షిరిడీ నిర్మాణాన్ని హైదరాబాద్ నగరములోని మల్లాపూర్‌నందు చేపట్టి ఇప్పటివరకు ద్వారకామాయి, గురుస్థాన్, చావడిల నిర్మాణాలను పూర్తి చేసారు స్వామీజీ భక్తులు.

ప్రతినెల స్వామీజీ జన్మదినమైన 12వ తేదీన మల్లాపూర్ మందిరంలో





అన్నదానం మరియు ఏకాహం ('ఓం సాయి, శ్రీ సాయి, జయ జయ సాయి' నామమును నిర్విరామంగా 24 గంటలపాటు గానము చేయుట) కార్యక్రమములను జరుపుచున్నారు.

వీరు నిర్మించిన ద్వారకామాయి ధుని నుండి పొగ ద్వారకామాయం తయు వ్యాపించి భక్తులకు అసౌకర్యాన్ని కలుగజేయగా ఈ విషయాన్ని స్వామీజీకి విన్నవించగా స్వామీజీ పొగ గొట్టం ఎత్తు పెంచమని సలహా నివ్వగా పొగ గొట్టం సరియైన కొలతలతోనే అమర్చామని చెప్పగా స్వామీజీ మీరు నిర్ణయించిన దానికంటే పొగ గొట్టం ఎత్తు తక్కువైనదని చెప్పారు. వారు పరీక్షించి చూడగా పొగ గొట్టం ఎత్తు తక్కువగా నుండుట గమ నించి ఆశ్చర్యపోయి దానిని సరిచేసారు. ఎంతో దూరంలో గల షిరిడీలో ఉండి హైదరాబాద్‌లో జరిగిన చిన్న పొరపాటును సహితం స్వామీజీ దృష్టిని తప్పించుకోలేకపోయిందంటే స్వామీజీ దివ్యదృష్టి ఎంత గొప్పదో పాఠకులే గ్రహింతురు గాక. ఈ మందిర ప్రాంగణమందు స్వామీజీ జ్ఞాపకార్థం ఒక చక్కని ధ్యానమందిరమును కూడ నిర్మించినారు.

అఖిల భారత సాయి నామ సప్తాహ కమిటీ వారు శ్రీ క్షేత్రం గానుగా పురంలో నిత్య అన్నదాన పథకాన్ని ప్రారంభించాలని తలంచి స్వామీజీ ఆశీస్సులను వేడగా స్వామీజీ ఆశీర్వదించుటయేగాక వారి అమృత హస్తములతో తొలి భిక్ష నొసంగిరి. స్వామీజీ ఆశీర్వాద బలం వలన ఈ పథకం దినదినాభివృద్ధి చెంది అన్ని సౌకర్యములతో ఒక చక్కని భవనమును కూడ నిర్మించుకున్నారు. ఈ పుణ్యక్షేత్రంలో 25.03.1996న అన్నదాన ప్రాంగణమందు అఖండ దీపారాధన, శివలింగాన్ని ప్రతిష్ఠించి నారు. ఇటీవల కాలంలో షిరిడీ సాయిమందిరము నిర్మించి అందు అఖండ సాయి నామ సంకీర్తనను కూడ నిర్విరామంగా నిర్వహించుచున్నారు.

ఆదిలాబాద్ జిల్లా కల్లూరులో స్వామీజీ ఆశీస్సులతో శ్రీ దత్త వెంకట సాయి సమాజమును స్థాపించి సుందరమైన దత్తాత్రేయ, వేంకటేశ్వర

స్వామి, సాయినాథుని మందిరములను నిర్మించి, ధునిని కూడ ఏర్పాటు చేశారు. స్వామీజీ ఆశీస్సులతో నిత్య అన్నదాన పథకాన్ని అక్కడకు వచ్చే భక్తులకు ఉచిత వసతి సౌకర్యాన్ని కూడ కల్పిస్తున్నారు.

స్వామీజీ మహాసమాధి చెందిన తరువాత ఒక సుందరమైన ప్రార్థన, పారాయణ మందిరమును నిర్మించి చంద్రునికో నూలు పోగు చందాన స్వామీజీకి అంకితమొనరించిరి.

పుంజుల శ్యామమూర్తిగారు, కబూతర్ ఖానా, హైదరాబాద్‌లో గల సాయి మందిరమందు సప్త సప్తాహము సాయి నామ సంకీర్తనలు చేయ తలపెట్టి స్వామీజీ ఆశీస్సులు కోరగా స్వామీజీ తొలి దక్షణ నొసంగి "ఈ ధనముతో బియ్యం, నూనె కొనండి, సప్త సప్తాహముల కంటే అధికము గానే నామ సంకీర్తనము చేయించుకుంటాడు బాబా" అని ఆశీర్వదించారు. స్వామీజీ ఆశీస్సులు లభించాయని సంతసించి 03.06.1994న సప్త సప్తాహం ప్రారంభించి, వచ్చిన భక్తులందరికి ఉచిత భోజన సదుపాయం కూడ భక్తులిచ్చిన విరాళములతో ప్రారంభించారు. ఈ నామ సంకీర్తన 19.09.1994 వరకు అనగా 108 రోజులు నిరంతర నిత్య అన్నదానముతో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కబూతర్ ఖానా మందిరంలో బాబా ద్వారకామాయి భంగిమలో గల పాలరాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించుట ఒక ప్రత్యేకత. మనం కోరుకున్న దానికంటే ఎక్కువే సాయి ఆశీస్సులతో స్వామి ప్రసాదించేవారు.

**స్వామీజీ దివ్యశక్తులు :**

శ్రీ దత్త వెంకట సాయి సమాజం, కల్లూరు, వారు స్వామీజీకి షిరిడీలో సరియైన వసతి సౌకర్యములు లేక అష్టకష్టములు పడుటగాంచి స్వామీజీకి కల్లూరులో అన్ని సౌకర్యములతో కూడిన ఒక ఆశ్రమాన్ని నిర్మించి స్వామీజీని కల్లూరు తీసుకువెళదామని తలంచి తమ కోర్కెను స్వామీజీకి విన్నవించగా స్వామీజీ తనకు సాయి సన్నిధియే పరమావధియని షిరిడీ వదలి ఎక్కడకు వెళ్లేది లేదని ఘంటాపథముగా తెల్పిరి.

**(సశేషం)**







# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

### 4. సాయిని దెలియంగ సాధ్యమా

సీ. స్మర్తుగామిని జీర సాక్షాత్కరించును
కర్మ బంధము బాపు కామితార్థి
యోగిరాజతడౌను యోగుల యందును
రాజాధి రాజౌను రాజులందు
శిరిడి నాధుని నీవు చిత్తాన నిలిపిన
చీకు చింతలు లేని జీవితంబు
సాయిని దెలియంగ సాధ్యమా? మనలకు
అమరులకైనను యలవిగాదు.

తే.గీ. ఇలను కోర్కెలు దీర్చెడు యీశు డితడు
పరముఁ బొందగ నడిపించు పరమ శివుడు
జన్మ జన్మల ప్రారబ్ధ సంచితముల
మూటగట్టించి తగలెట్టు మూర్తి సాయి. 1

కం. భిక్షాటనమును జేయుచు
రక్షించెను శిరిడినందు రయమున ప్రజలన్.
శిక్షింపక సంస్కరణను
అక్షయముగ వారికొసగె నాముష్మికమున్. 2

ఆ.వె. మానవునిగ బుట్టి మరుజన్మ లేకుండ
పుడమినందు బొంద పుణ్యతతులు

ఆర్త జనుల బ్రోసి యాదరణను జూప
నీదు కర్మలన్ని నివురు లగును. 3

ఆ.వె. విశ్వమందు పుడమి యిసుమంత యగునోయి
విశ్వ గురుడు సాయి విశ్వ బంధు
గురుని కొలసిన యెడ గురుతెఱుంగ గలవు
బ్రహ్మలోక మునకు పథము నీవు. 4

తే.గీ. మత్స్య కూర్మాది జన్మలు మరచినావు
పురుగుగా పుట్టితి వపుడీ పుడమి నందు
పక్షి జన్మన పంటలు పాడుచేసి
పాముపై నీవు పగతోన పరగినావు 5

తే.గీ. ఎన్ని జన్మల ఎంతెంత ఏర్చి కూర్చి
పాప పుణ్యాల మూటలు పరగ గట్ట
జన్మ కలిగెను మానవ సంతు నందు
మాధవునిఁ జేర శోధించు మార్గ మిపుడు. 6

ఆ.వె. గురుని యండ లేక గురుతించ లేవులే
మాధవుడిని జేరు మార్గ మీవు.
సాయిజేర నతడు సాయంబు వచ్చును
చేయిబట్టి నిన్ను జేర్చు నచట 7

ఆ.వె. కంటకముల తోడ కాననముల తోడ
క్రూర మృగము లుంట కష్ట తరము
మార్గ గామి యున్న మార్గము సుగమము
మున్ను సాయి నడువ పూలబాట 8


ఆ.వె. సాయి వెంట యున్న సానుకూల మగును
కష్ట నష్టమేమి కలుగకుండు
ముందు తాను యుండి మోక్షమునకు జేర్చు
ఓపినంత దనుక ఒడిసి పట్టు. 9

(సశేషం)









# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

(గత సంచిక తరువాయి)

కూతురు యమునను పూనాలోని “ఫడ్కే” కుటుంబంలో ఇచ్చి వివాహం చేసారు. తీవ్ర అనారోగ్యం పాలైన ఎందరో భక్తులను మృత్యుకోరల్లో నుండి బయటకు తీసి, వారికి శ్రేయస్సు చేకూర్చిన బాబా, దాసగణు విషయంలో మాత్రం తమ మొత్తం ప్రాధాన్యతను తన పారమార్థిక పురోగమనానికే ఇచ్చారు. దీనిని బట్టి బాబా దర్బారులో దాసగణు స్థానం ఎంత ప్రత్యేక మైనదో మనకు తెలుస్తుంది. సరి!

దాసగణు ప్రాపంచిక (ఉద్యోగ) జీవనానికి ప్రమాదం కల్పిస్తూ, పారమార్థిక జీవితానికి ప్రమోదం గావిస్తూ, సాయి కల్పించిన ఆ సంఘటనలను (సంకటాలను) ఒక్కొక్కటిగా తెలుసుకునేందుకు ఇక మనం సమాయత్తమవుదాం!

**మొదటి సంకటం :** శ్రీ వామనశాస్త్రి గారు, దాసగణుకు మంత్రోపదేశం చేసేటప్పడు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా పండరీపుర యాత్ర చేయమని చెప్పారని మనం ముందరే చెప్పకున్నాం. శ్రీ వామనశాస్త్రి గారి ఆజ్ఞానుసారం దాసగణు ప్రతి సంవత్సరం పుండరీ యాత్ర చేసేవాడు. కానీ, ఒకసారి సంవత్సరం పూర్తి కావస్తున్నా యాత్ర చేయడం కుదరలేదు. ఇక గడువు ముగియడానికి కొద్దిరోజులే సమయం ఉండటంతో సెలవు పెట్టి, పండరీపుర యాత్ర చేయాలని నిర్ణయించుకున్నాడు. అప్పడు ఫిలిప్ అనే ఆంగ్లేయుడు దాసగణు పై అధికారిగా ఉండేవాడు. దాసగణు యొక్క ముక్కుసూటి స్వభావం, కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడే వైనం వంటి గుణాల వలన దాసగణుకి పై అధికారులతో సత్సంబంధాలు ఉండేవి కావు.

పైపెచ్చు తమాషా పాటల రచయితగా సమాజంలోనున్న పేరు, పెద్దపెద్ద వారి వద్దనున్న పలుకుబడి వంటి వాటి వలన సహోద్యోగులకు దాసగణంటే చాలా అసూయగా ఉండేది. అందువలన అవకాశం దొరికితే చాలు, దాసగణుని ఇబ్బంది పెట్టాలని చూసేవారు. అటువంటి నేపథ్యంలో, దాసగణు పై అధికారి ఫిలిప్ వద్దకు వెళ్ళి "తనకు వారం రోజులు సెలవు కావాలని" అడిగాడు. అప్పుడు ఆ పై అధికారి "సెలవు ఇవ్వడం కుదరదని" చెప్పాడు. దాంతో దాసగణు "ఏమయితే అదయింది. బాబా ఉన్నారు" అనే దృఢ నిర్ణయం తీసుకొని, సెలవు తీసుకోకుండానే పండరీపురం వెళ్ళిపోయాడు. "పోలీసు సిపాయి గణపతిరావు ఎటువంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరి అవుతున్నాడు. కనుక ఉద్యోగం నుండి తొలగించాలని సిఫారసు చేస్తూ" ఫిలిప్‌గారు తన పై అధికారులకు ఫిర్యాదు చేసాడు.

ఇక్కడ దాసగణు పండరీపురం అయితే వెళ్ళాడు కానీ, ఉద్యోగం ఏమవుతుందోననే ఆందోళన మనసును తొలచి వేయసాగింది. "బాబా, నాకు ఎటువంటి సంకటం రానివ్వకండి. నేనే గౌరవమైన రీతిలో ఉద్యోగాన్ని వదలి వేస్తాను" అని బాబాను ప్రార్థించాడు. తరువాత చంద్రభాగ నదిలో స్నానం చేసి బయటకు వస్తుండగా, "పాడళీ" అనే గ్రామం యొక్క పటేల్ కంగారుగా వస్తూ ఎదురుపడ్డారు. దాసగణుని చూసి ఆ పటేల్ సంతోషంగా "గణపతిరావ్, దేవుని లాగా దొరికావు. నావి రెండు ఎద్దులు దొంగిలించబడ్డాయి. వాటికోసమై వెతుకుతుంటే ఇక్కడ ఒక ఎద్దు కనపడింది. వెదకితే రెండోది కూడా దొరుకుతుంది. నాతో పద" అని అర్థించాడు. ఆర్తితో మ్రొక్కగానే, గ్రక్కున అనుగ్రహించిన బాబాకు దాసగణు మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకుంటూ, ఆ పటేల్‌తో కలిసి ఇంకొక ఎద్దుని వెదకడానికై వెళ్ళాడు. ఎక్కువ శ్రమ పడకుండానే రెండవ ఎద్దు దొరికింది. అప్పుడు జరిగినదంతా ఆ పటేల్‌చే వ్రాతపూర్వకంగా







తీసుకొని, పండరీపురం పోలీసు అధికారి చేత ధృవీకరణ సంతకం చేయించుకొని, నాలుగు రోజులు ప్రశాంతంగా పండరీపురంలో గడిపి, జాంఖేడ్ వచ్చాడు.

తాను స్టేషనుకు వచ్చేటప్పటికీ, వ్రాతపూర్వకంగా సంజాయిషీ ఇవ్వమని పైనుండి ఉత్తర్వులు వచ్చాయి. ఆ శ్రీముఖానికి సమాధానంగా "తాను దొంగిలించబడిన ఎద్దులను శోధిస్తూ వెళ్ళానని, చివరకు వాటిని పుండరీ పురంలో పట్టుకున్నానని, అందువలన తాను పూర్తిగా విధులలోనే ఉన్నానని" సంజాయిషీ ఇస్తూ "పాడళీ" గ్రామ పటేల్ ఇచ్చిన వ్రాత ప్రతినీ మరియు పండరీపురం పోలీసు అధికారి ఇచ్చిన ధృవీకరణ పత్రాన్ని, తన సంజాయిషీకి జతచేసి దాసగణు పై అధికారులకు పంపించాడు. దాసగణు సంజాయిషీకి సంతృప్తి చెందిన పై అధికారులు, దాసగణు విధి నిర్వహణను అభినందిస్తూ, తప్పడు ఫిర్యాదు చేసాడని శ్రీ ఫిలిప్‌ను అభిశంసిస్తూ ఉత్తర్వులు వెలువరిచారు. ఆ విధంగా దాసగణు ఉద్యోగం ఊడిపోయే ప్రమాదం నుండి బయటపడ్డాడు. కానీ, మానవ సహజ ధర్మాన్ని అనుసరించి-బాబాకు మాట ఇచ్చినట్లుగా - తాను గౌరవంగా ఉద్యోగం వదిలేసే విషయాన్ని పూర్తిగా మరచిపోయాడు.

**రెండవ సంకటం :** తరువాత కొద్దికాలానికి దాసగణు బదిలీ జాంఖేడ్ నుండి నెవాసా గ్రామానికి జరిగింది. దాసగణు నెవాసాలో పనిచేసే టప్పడు "రామయ్య" అనే సత్పురుషుడు నెవాసాలోని మోహినీరాజ్ ఆలయంలో ఉండేవారు. చూడటానికి పిచ్చివానివలే కనిపిస్తూ, ఒట్టి చేతులతోనే నిప్పుని, పొగాకుని పట్టుకొని ఎప్పుడూ పొగపీలుస్తూ ఉండే వారు. ఆయన ఎవరినీ తమ దగ్గరకు రానిచ్చేవారు కారు. ఎవరైనా ఆ ప్రయత్నం చేస్తే, వాళ్ళ మీదకు రాళ్ళు విసిరేవారు. కానీ, దాసగణుని చూస్తే మాత్రం, ఎంతో ప్రేమతో దగ్గర కూర్చోబెట్టుకొని, ఎన్నో వేదాంతపరమైన విషయాలను ముచ్చటించేవారు.

**(సశేషం)**

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

(గత సంచిక తరువాయి)

## 6. నరకుడు

హస్తినాపురం నుండి కృష్ణుడు పరివార సమేతంగా తిరిగి ద్వారకకు వచ్చి శ్యమంతకోదంతం తర్వాత కొన్ని నెలలు గడిపాడు. తరువాత ప్రభాస క్షేత్రానికి ఉపమన్యు మహర్షి వచ్చి ఉన్నాడని తెలిసి, బలరామునితో సోమ నాథుని దర్శించి, ఉపమన్యుల వారిని సేవించి రావచ్చునని బయలు దేరాడు. ఉపమన్యుడు ధౌమ్యమహర్షికి జ్యేష్ఠ సోదరుడు.

ప్రభాసంలో ఉపమన్యుల వారి సాంగత్యంలో శ్రీకృష్ణుడు తనలోని నిగూఢ అంతశ్శక్తులను దర్శించుకున్నాడు. ఉపమన్యుల వారి సంగతిలో కొన్నాళ్ళు గడపాలని అనిపించి, తనను ఒంటరిగా కొన్నాళ్ళు వదలిపెట్టమని బలరాముణ్ణి ప్రార్థించి, ఒప్పించాడు. 'నీవెప్పుడూ ఏదో ఒక విస్మయాన్ని సృష్టిస్తావయ్యా కృష్ణా! ఒక వారం కావాలంటే నేనూ ఉంటా. ఇద్దరమూ కలిసే వెళ్దా'మన్నాడు బలరాముడు.

'నన్ను కొన్ని రోజులపాటు ఉపమన్యుల వారితో గడపనీ, కాదనకున్నా ఆయన మహాయోగి. పాశుపతమత దివ్యవ్రతుడు. సిద్ధపురుషుడు, అష్ట సిద్ధులను సాధించిన యోగేశ్వరుడు, నిత్యకర్మ పరాయణుడు'.

'ఆయనతోపాటు నీవు కూడా ముక్కు మూసుకుని కూర్చుంటావా? మనకెందుకయ్యా ఇవన్నీ. ద్వారకలో మన కోసం జనం నిరీక్షిస్తుంటారు. మరి నీవు లేందే నేను ఏం చేయగలను కృష్ణయ్యా?' అని బలరాముడు ఆర్ద్రంగా అన్నాడు.

'మనం కర్మబద్ధులమే. మీరు చెప్పింది నిజమే. దానిని చక్కగా నిర్వ హించడానికి నిగ్రహానిగ్రహాలు అవసరం కదా! అదే యోగమంటారు కదా







పెద్దలు. ఆ పెద్దల సేవలో మనస్సులోని వెలుగు కవాటాలు తెరుచు కుంటాయి'.

'సరేనయ్యా! నేనే వెళ్తా, నీవు నా మాట ఎప్పుడు విన్నావు కనుక' అన్నాడు బలరాముడు, శ్రీకృష్ణుడు మనోమోహకంగా నవ్వి, బలరామునికి పాదాభి వందనం చేశాడు.

ప్రభాసంలో శ్రీకృష్ణుడు ఉపమన్యుల వారి వద్ద పాశుపత వ్రతాన్ని స్వీకరించాడు. యోగసిద్ధిని సాధించడానికి నిత్యసాధన చేశాడు. అణిమాద్యష్ట సిద్ధుల స్వరూపాలు-వాటి శక్తులను ఆవహింపజేసుకున్నాడు. అలా నిరంతరం ఒక మండలం కఠోర నియమాలను పాటిస్తూ, ఉప మన్యుని సన్నిధిలో కర్మయోగ రహస్యాన్ని, పంచాక్షర మంత్ర పావనాశక్తిని, ఋషిప్రోక్త శక్తిపాత రహస్యాన్ని గ్రహించాడు. ఇక ఉపమన్యుల వారి వద్ద సెలవు తీసుకునే సమయం వచ్చింది.

'మహర్షీ! నా జీవనలక్ష్యానికి మీ సన్నిధి వెలుగులు ప్రసాదించింది. నన్ను ఆశీర్వదించండి' అని వినమ్రుడైనాడు.

ఉపమన్యుడు అర్ధనిమీలితుడై, క్షణం ఆగి 'వాసుదేవా! నీవు కారణ జన్ముడవని నాకు తెలుసు! లోకానికి సదాచార సంపత్తిని, అధికార ప్రయో జనాన్ని, గురుభక్తిని ఆదర్శంగా చూపడానికే నా వద్ద ఇన్నాళ్ళు గడిపావు. కాని నీకు తెలియనిదేమున్నది? నీవు ధర్మగోప్తవు. నీచే తిరిగి సనాతన దివ్యమార్గం, కర్మమార్గం ప్రతిపాదింపబడుతుంది. నీవు కేవలం ద్వారక వరకే చూడగూడదయ్యా! చుట్టూ ఎంత తిమిరం ఉన్నదో కనబడడం లేదా కేశవా?" అని గద్గదంగా అన్నాడు.

శ్రీకృష్ణుడు వినయంగా చేతులు జోడించి 'ప్రస్తుతం చేయదగ్గది ఏమిటో తెలపండి' అని అన్నాడు.

'నా వెంట ఉన్న శ్రోత్రియులను, తాపసులను ఇంతవరకు నీకు పరిచయం చేయలేదు. వారు ఆర్తులు. నీవు ఆర్తత్రాతవు కృష్ణా! నీవేమిటో నాకు తెలుసు. వారికి నీవు తప్ప మరెవ్వరూ ఉపశమనాన్ని

కలుగచేయలేరు'.

'నేను వారికి ఏ విధంగానైనా సహాయపడితే అది సజ్జనసేవ అవుతుంది కదా మహాత్మా!'

ఆ మధ్యాహ్నం ఉపమన్యు మహర్షి వసతిలో, వారితోపాటు పది మంది తాపసులు అయిదారుగురు శ్రోత్రియులు సమావేశమైనారు. ఉపమన్యుని ప్రక్కనే శ్రీకృష్ణుడు కూర్చున్నాడు.

ఉపమన్యుడు ఆ కూర్చున్న ఒక వృద్ధ శ్రోత్రియుని, విషయ ప్రసక్తి చేయమని సంకేతించాడు.

ఆ వృద్ధ శ్రోత్రియుడు శ్రీకృష్ణునికి వేదోక్తంగా ఆశీర్వదించి 'వసుదేవ తనయా! ముందుగా నా నివాసాన్ని గురించి విను. మా ప్రాంతాన్ని అసమ దేశమంటారు. అది తూర్పు సీమల్లో ఉన్న పర్వతప్రాంతం. దక్షుడు జగన్మాత సతీదేవిని యజ్ఞవాటికలో పరాభవించినప్పుడు ఆ తల్లి కాలిబొటనవ్రేలితో యోగాగ్నిని పుట్టించుకొని ఆత్మాహుతి చేసుకున్న గాథ మీకు తెలియంది కాదు. ఆ శరీరాన్ని పరమశివుడు భార్యావిరాహ విశ్లథుడై భుజాన వేసుకొని తిరుగుతూంటే మహావిష్ణువు ఆ ప్రమాదాన్నుంచి జగత్తుని కాపాడడానికి తన చక్రంతో ఆమె తనువును ఖండిస్తూ వెళ్ళాడు. ఆ ఖండాలు ఎక్కడెక్కడ పడ్డవో, అక్కడక్కడ శక్తికేంద్రాలై పీఠాలై వెలిసాయి. అమ్మవారి ఒక శరీర భాగ మా అసమదేశంలో ప్రాగ్జోతిషం దగ్గరే నేలపడింది. అదే కామాఖ్యం. అమ్మవారి శక్తిపీఠం. ఆ దాపునే ఒక మహాకుండం ఉన్నది అధార్మికులై, కార్యవీర్యునికి బాసటగా నిలచిన రాజన్యులను భార్గవ పరశురాముడు తన పరశుధారకు గురిచేసి, ఒకసారి తన పరశువును ఆ మహాకుండ లంలో శుభ్రపరచుకున్నాడట. అందుకే దానిని పరశురామ కుండమంటారు. ఆ దగ్గరే లోహిత నది ఉన్నది. అది దివ్యనదీమ తల్లి. ఆ నదిలో స్నానం చేసి, ఆ కుండంలోని జలాన్ని సేవించి, కామాఖ్యశక్తిని అనాదిగా భక్తులు. సాధకులు, తపస్వులు కొలుస్తూ వస్తున్నారు. అంతటి పవిత్రక్షేత్రం కనుకనే దానిని 'ప్రాగ్జోతిష' మన్నారు.

**(సశేషం)**







బాలవాణి

# నరసింహావతారం

హిరణ్యాక్షుడిని శ్రీహరి వరాహరూపంలో వెళ్ళి చంపివేశాడనీ విన్నాడు. హిరణ్యాక్షుని అన్న హిరణ్యకశ్యపుడు. శ్రీహరి వరాహరూపంలో వెళ్ళి పాతాళంలో నా తమ్ముడిని చంపినాడట. అతడు ఏ లోకంలో ఎక్కడ దాగినా సరే నేను వానిని చంపి తీరుతాను. అతడెక్కడవున్నా విడువను. యజ్ఞ యాగాదులు జరిగేచోట, వేదపఠనం జరిగే చోట, గోవులు, బ్రాహ్మణులు తిరిగేచోట అతడుంటాడని అంటారు. అందుచేత ఆయా చోట్ల వెదకండి" అని రాక్షసుడు తన అనుచరులతో అన్నాడు. వెంటనే రాక్షసులు గుంపులు గుంపులుగా వెళ్ళి ఆశ్రమాలను, ధార్మిక స్థలాలను అల్లకల్లోలం చేయ సాగారు. హిరణ్యకశ్యపుడు మందరగిరికి వెళ్ళి బ్రహ్మనుద్దేశించి తపస్సు ప్రారంభించాడు. ఈ వార్తలన్నీ విని దేవేంద్రుడు హిరణ్యకశ్యపుని భార్య లీలావతిని చెరబట్టి తీసుకుని వెళ్ళాడు. త్రోవలో అతనికి కలిసిన నారదుడు అతనికెంతో నచ్చజెప్పి, ఆమెను తన ఆశ్రమానికి తీసుకువెళ్ళి ఆశ్రయం ఇచ్చాడు. నారదుడు దినదినమూ బోధించే శ్రీహరి గాథలు, సంకీర్తనలు వింటూ వింటూ లీలావతిదేవి గర్భంలోని శిశువు పరమ హరిభక్తుడుగా తయారయినాడు.

హిరణ్యకశ్యపుని తపస్సు ఫలించి, గాలిలోగానీ, భూమిపైగానీ, నీటిలో గానీ, ఏ దిక్కులోగానీ రాత్రులలోగానీ, పగళ్ళలోగానీ, రాక్షసులు, మృగ ములు, పాములు, మానవులు, దేవతలు ఎవ్వరూ గానీ తనను సంహ రించలేని విధంగా వరం పొందాడు. ఇంటికి మరల వచ్చిన హిరణ్య కశ్యపు నికి, నారదుడు పుత్రుడైన ప్రహ్లాదునితోపాటు లీలావతిని తీసుకువెళ్ళి అప్పగించాడు. కొంతకాలం తర్వాత ఆ రాక్షస ప్రభువు తన కుమారుడిని గురువుల చెంతకు పంపి చదివించదలచుకున్నాడు. తన కుల పురోహితుని కొడుకు లైన చండామర్కులను రావించి వారికి ప్రహ్లాదుని అప్పగించాడు. "వీడికి నా ప్రతాపం గురించిన జ్ఞానం ఏమీ లేదు. నా దగ్గరకు రాడు. పలకడు. మీరు మాన్యులు, గురువులు కనుక ఇతడిని విద్యావంతుని చేయండి" అని తన కుమారునితో- "నాయనా" చదువని

వాడు అజ్ఞాని అవుతాడు. చదువుల వలన మంచిచెడుల వివేకం తెలుస్తుంది. అందుచేత ప్రతి వారూ చదువుకోవాలి. పూజ్యులైన ఈ గురువుల వెంటవెళ్లి వారుచెప్పినవి నేర్చుకో"అని అన్నాడు. ప్రహ్లాదుడు తల్లి గర్భం నుండే భక్తి శ్రద్ధలు నేర్చినవాడు, కారణజన్ముడూను. కనుక గురువులు చెప్పినదంతా ఒక్క క్షణంలో నేర్చుకునేవాడు కానీ సమయమంతా హరిచింతనతోనే గడిపేవాడు. తన మిత్రులకు కూడా ప్రపంచం అశాశ్వతమని, శ్రీహరి పాదాలే శాశ్వతమని చెప్తుండేవాడు. ఆ పిల్లలు కూడా హరినామ సంకీర్తనం చేస్తుండేవారు. కొంతకాలం అలా గడిచిపోయింది.

హిరణ్యకశ్యపుడు కొడుకును రాజభవనానికి పిలిపించుకొని అతని చదువుసంధ్యలను గూర్చి వివరించాడు. నీకు నచ్చిన విషయం ఒకటి చెప్పమన్నాడు. అతడు "మానవులందరికీ ఇల్లనే చీకటి బావిలో పడి కొట్టుకోవడం కంటే నేను నువ్వు అనే భ్రమలతో వేరువేరుగా ప్రవర్తించడం కంటే సర్వమూ భగవన్మయమేనని భావించి, భగవంతుని యందు మనస్సుంచి జీవించడం మేలు" అని చెప్పాడు. వెంటనే రాజు బాధపడి, "నాయనా! ఈ మాటలు నీకు ఎవరు నేర్పారు? దేవతలను, దేవాధిపతులను, మునులను, యక్షకిన్నరాదులను నశింపజేయడమే మన కర్తవ్యం. నీవు ఈ హరి గిరి అనే ఈ మాటలు ఎక్కడ నేర్చుకున్నావు?" అని అన్నాడు.

అది విన్న ప్రహ్లాదుడు ఇలా అన్నాడు. "తండ్రీ! అజ్ఞానులు కొందరు మాయలో పడి భగవంతుని స్మరింపరు. దైవానుగ్రహం వలన నా మనస్సు హరి సన్నిధిన స్థిరమౌతున్నది. మందార పుష్పాలలోని తియ్యతేనీయలు త్రాగే తుమ్మెద ఉమ్మెత్తపూల మీద వాలుతుందా? స్వచ్ఛమైన గంగానది అలలపై ఆడుకొనే రాజహంస చిన్నచిన్న ఏరుల జోలికి వెళ్లగలదా? మావిచిగుళ్లు తిని ఆనందించే కోకిల అవిసె చెట్ల మీద వాలుతుందా? పున్నమివెన్నెలలను ఆస్వాదించగల చకోరపక్షి మంచుచుక్కల జోలికి వెళుతుందా? శ్రీహరి పాదారవింద ధ్యానంతో మత్తెక్కే మనస్సు మరొక దానిని ఎలా ఇష్టపడుతుంది?" ఆ మాటలు వినగానే రాజపురోహితునికి ఒళ్లు మండిపోయింది. "ఛీ! నీచుడవు. నీవు మేము చెప్పని తర్కవాక్యాలన్నీ వాగుతూ మాకు అవమానం కలిగించావు. రాక్షస ప్రభువుకు శత్రువువై పుట్టావే తప్ప కొడుకువై కాదు" అని కోప్పడ్డారు. ఇతనిని ఎలాగైనా దండించి దారికి తెస్తామని రాజుకు మాట ఇచ్చి తిరిగి గురుకులానికి తీసుకువెళ్లారు.







# ద్వారవతిలో పూర్ణిమనాడు

**ప్రియ సాయిభక్తులారా!**

పూర్ణిమ చంద్రుని పదహారు కళలూ ప్రదర్శించగల పర్వదినం మనది. చాంద్రమానం ప్రకారం నడిచే కాలమానపు లెక్క. పూర్ణిమ సత్కార్యారంభాలకూ, కావ్యారంభాలకూ కూడా ప్రశస్తమైన దినం. పూర్ణిమ నాటి వెన్నెల సాధకుల ధ్యానానికి ఎంతగానో ఉపకరిస్తుంది. ఇలా ఎన్నో రీతుల గొప్పతనం కలిగిన పూర్ణిమనాడు కలశస్థాపన చేసి వ్రతాలు, భజనలు, సత్సంగాలు చేసుకోవటం శక్తిదాయకం, ముక్తిదాయకం కూడా. అందుచేత-

ప్రతి పూర్ణమనాటి సాయంత్రం ద్వారవతి (సాయినాథ దేవాలయం)లో శ్రీ సాయినాథ వ్రతం జరుగుతుంది. శ్రీ సాయి చరిత్ర మొత్తం ఐదు కథల ద్వారా విన్నందున ఒకసారి చరిత్ర చదివిన అనుభూతి కలుగుతుంది. శ్రీ సాయి దత్తావతారం గనుక యీ వ్రతం దత్తకల్పం ఆధారంగా జరుగుతుంది. పరమపూజ్య గురుదేవుల సాన్నిధ్యశక్తీ, ఆశ్రమ దేవాలయంలో జరగటం చేత క్షేత్ర శక్తీ కూడా మంత్రశక్తికి తోడవుతాయి. సామూహికంగా జరగటం చేత కలిగే మనశ్శక్తి వాటికి కలుస్తుంది. ఇందులో పాల్గొనదలచిన వారు తమ పేర్లు, గోత్రాలు చెప్తూ ఒకరోజు ముందుగా నమోదు చేసుకోవచ్చు. **(ఫోన్ నెం. 9848133565, 9440413455)** వారు వ్రతానికి స్వయంగా రాలేకపోయినా-వారి గోత్రనామాలతో పూజ సలిపి ప్రసాదం పోస్టులో పంపుతారు. ఈ వ్రతానికి రుసుము రూ.116/-గా నిర్ణయింపబడింది. మీ శక్తినిబట్టి భగవంతుడు మీకు చేస్తున్న మేలునుబట్టి కట్టవచ్చు. సంవత్సరం అంతటికీ ఒకేసారి చెల్లించవచ్చు కూడా. 'లోక కళ్యాణార్థమ్' అనేది ప్రధాన లక్ష్యంగా జరుపబడే యీ వ్రతాల నిర్వహణలో పాల్గొని సత్ఫలితాలను పొందవలసిందిగా సాయిధామం అందరినీ ఆహ్వానిస్తున్నది. చిరునామా వివరంగా వ్రాసి పంపండి.

**డి.డి.లు, చెక్కులు, ఎం.ఓ.లు పంపవలసిన చిరునామా :**

**శ్రీ సాయి సేవా సమితి ట్రస్ట్, రామలింగంపల్లి పోస్టు, యాదాద్రి భువనగిరి జిల్లా-508126**

# పరిప్రశ్న

- కీ.శే. శ్రీ ఎక్కిరాల భరద్వాజ

**ప్రశ్న:** మృత్యువు తప్పదని తెలిసి కూడా మృత్యుంజయ జపం చేయాలని, చేస్తే మృత్యువును జయించవచ్చునని చెప్పడమేమిటి? **- ఒక జిజ్ఞాసువు.**

**జవాబు :**చాలా మంచి ప్రశ్న! మృత్యువును జయించవచ్చని ఋషులు చెప్పిన భావమొకటైతే యీనాటి 'పెద్దలు' చెప్పే భావం వేరొకటి. అసలు పండితులు జ్ఞానుల లక్షణం వేరు. **"గతా సూనగతా సూన్శ్వనాను శోచంతి పండితాః"** అన్నాడు కృష్ణుడు(భగవద్గీత), జ్ఞానులు చనిపోవడం గురించి, చనిపోకపోవడం గురించి చింతించరు-అని గీత చెప్పినది. కనుక చనిపోతామని భయపడే వారే దానిని తప్పకునే యత్నం చేసి విఫలమవుతారు. చనిపోయేది దేహమే. పుట్టిన ప్రతీదీ ఏనాటికైనా చావవలసినదే(గీత). ఈ ప్రకృతి మాత్రమే భగవంతుని, శాసనం అదే విధి. దానికి రాముడు, కృష్ణుడూ, పామరుడూ అందరూ తల ఒగ్గవలసినదే.

అయితే నశించేది దేహమే. దానికి జన్మ ఉన్నది గనుక మృత్యువు వుండవలసిందే. అయితే జీవుడు కేవలం చైతన్యస్వరూపి కనుక అతనికి మరణము దేహాలను నిర్మించుకోవడం, శిథిలం కాగానే విడిచివేయడమూ మాత్రమే. ఇది ఆ జీవి అజ్ఞానంలో వున్నంత వరకు జరుగవలసినదే. నిరంతర సాధన వలన తాను నిజానికి సర్వగతమైన బ్రహ్మమేనన్న జ్ఞానం కల్గిననాడు-తాను పరిమితుడు, అల్పజ్ఞుడూ అన్న భ్రాంతి వీడుతుంది. అంతటితో జననం నుండీ, మరణం నుండీ-అంటే ఒక శరీరాన్ని నిర్మించుకోవడం, దానిని నశింపజేసుకోవడమనే అవసరం నుండి విడివడుతూ-జ్ఞానమూ, సాధనా జీవించియుండగానే సాధ్యం గనుక, జ్ఞానం కల్గితేగాని దుఃఖరాహిత్యం కల్గదు గనుక, అది కలిగేవరకూ జీవుడు దేహాలను ధరిస్తూ, విడుస్తూ ఉండవలసినదే.







అనేక జన్మల సాధన వలన క్రమంగా జ్ఞానం పక్వమవుతూ వచ్చి, అది పూర్తి పక్వస్థితి నందినపుడు-ఇక జన్మించవలసిన అగత్యం నుండి విడివడుతాడు. అంటే తిరిగితిరిగి మరణించవలసిన దుస్థితి నుండి విడివడుతాడు. పరీక్ష పాసవడంతో మరల పరీక్షకు హాజరు కావలసిన, మరల చదువ వలసిన, అగత్యం నుండి విడివడుతాడు విద్యార్థి. ఇదీ అంతే.

పూర్ణమైన ఆత్మజ్ఞానం వలన యిలా మృత్యువు నుండి విడవడుతాడనీ, అట్టి పక్వజ్ఞానం త్రయంబకుడైన పరమేశ్వరుణ్ణి 'యజనం' చేసినందు వలన కలుగుతుందనీ చెబుతుంది మృత్యుంజయ మంత్రం. యజనం అంటే సర్వవిధములా, సర్వావస్థలయందూ ఆరాధించడం. అంటే శరీరంతో ఆయనకు ప్రదక్షిణ.

**నమస్కారాదులు :** నోటితో ఆయనను స్తుతించడం, నామం జపించడం, ఆయన గూర్చి వినడం సకల జీవులనూ యథాశక్తి సేవించడం. శరీరాన్ని అధర్మ కార్యాలలో వినియోగించకపోవడం, శారీరక యజసం. మనస్సును సదా ధర్మబద్ధంగా వంచుతూ, వివేకంతో యోచించి వ్యర్థ వ్యామోహాల పట్ల వైరాగ్యం చెందటం, భగవన్నియతమైన సుఖదుఃఖాలను, మరణాదులనూ గూర్చి వ్యర్థంగా చింతించకపోవడం, సచ్చింతనా, ధ్యానము-ఇవి మానసిక యజనం. భగవద్గీత యీ రెంటినీ ద్రవ్యయజ్ఞాలు, తపోయజ్ఞాలు అన్నది. దేహమానసాదులతో సద్గురువును సేవించి, పరిప్రశ్న చేసి యీ విధానాన్ని తెలుసుకొని ఆచరించాలి. ఇలా చేస్తే జ్ఞాన పరిపాకం కల్గి మృత్యువు నుండి విడివడతాము. పండిన దోసకాయ చెట్టుతో దానికి గల సంబంధం (తొడిమ) దానికై అదే విడివడినట్లు, అనన్యమైన ఈశ్వర ధ్యానం చేయమని యీ మంత్రార్థం. ఆ మంత్రం చెప్పినట్లు చేయకుండా దానిని ఉచ్ఛరిస్తే సరిపోతుందా? వైద్యుడు వ్రాసిచ్చిన మందులు సంపాదించి, సేవించిన ఫలితం ఆయనిచ్చిన చీటినీ వల్లిస్తే వస్తుందా? పైన వివరించినటువంటి సదాచారంతో గూడిన మంత్ర జపాదులు చేస్తేనే మృత్యురహిత స్థితి కలుగుతుందని భగవద్గీత శ్రద్ధాత్రయ విభాగ యోగ ప్రమాణం.

# సాధన మార్గము

- శ్రీ సిలువేరు సుదర్శన్

ఆత్మస్వరూపులముగా మన లక్షణాలు ఏమిటి? నమ్రత ముఖ్యం. లేని దానిని ఆపాదించుకోకూడదు. ఉన్న దానిని ప్రచారానికి, ప్రదర్శనకు ఉపయోగించుకోకూడదు. వినయం ముఖ్యం. దాని వలన ఆప్యాయత కలుగుతుంది. దీనితోపాటు అహింస భావము అలవరచుకోవాలి. ఇతరుల వస్తువులను దొంగిలించాలన్న కాంక్ష కూడదు. అపకారము చేసిన వాళ్లను కూడ ప్రేమించగలగాలి. ఓర్పు అత్యవసరం. మనస్సులో ఆలోచనలు, నోటి మాటలు, చేసే పనులు ఒకటై ఉండాలి. అదే నిజాయితీ. ఎవరెవరి నుంచి జ్ఞానము సముపార్జించామో వారందరూ గురువులే.

కృతజ్ఞతతో వారిని గౌరవించాలి. ఎల్లప్పడును శుచిత్వము అనగా బాహ్యములోనే కాకుండా అంతరంగములో అనగా మనస్సులోని భావాలు, బుద్ధిలోని ఆలోచనలు నిర్మలంగా ఉండాలి. స్థిరమైన భావాలు కలిగియుండడము ముఖ్యము. ఆత్మనిగ్రహం సదా ఉండవలయును. విషయవైరాగ్యం అవసరము. అహంకారము తగదు. జన్మ, మృత్యు జరా వ్యాధులతో కూడిన దుఃఖమయమగు సంసారమందలి లోపములను కూలంకషంగా పరిశీలించి, మన జీవితాలను ఆనందమయముగా మార్చుకోవలయును.

ఆలుబిడ్డలు, ఇండ్లు వాకిండ్ల యందు మోహము లేకుండా జాగ్రత్త పడవలయును. ఇవే ముఖ్యమనే భావనను విడనాడాలి. ఆత్మ వికాసము కొరకు అహోరాత్రులు సాధన చేయవలయును. మనశ్శాంతిని ఎట్టి పరిస్థితులలోను విడువకూడదు. ఇష్టము లేకున్నా ద్వేషము తగదు. ఇష్టాయిష్టాలను సమభావముతో స్వీకరించవలయును.

మనకు కొలబద్ధ ప్రతి పని చేయునపుడు భగవత్కార్యము అవుతుందా? కాదా! అని బేరీజు వేసుకోవాలి. ఒక్కొక్కరోజు ఒక్కొక్కటి







సాధన చేయవలయును. అనగా ఒకరోజు ... మాట్లాడను అని నిర్ణయించుకొని అమలుపరచవలెను. ఏకాంతవాసము అలవరచుకొని భగవంతుని గూర్చి చింతన చేయడము మంచిది. మతభావాలను మనము సంస్కరించుకోవలయును. ఆత్మ ఉద్ధరణకు కార్యక్రమము ఏర్పరచుకొని, దానిని అలవరచుకోవాలి.

ఏకాంతములో ఆనందము అనుభవించడము నేర్చుకోవాలి. వ్యక్తులను గూర్చి కాక సంఘటనలను గూర్చి చర్చించడము మంచిది. మన భావాలను మనమే సంస్కరించుకొని జ్ఞానిగా మారడానికి కృషి చేయవలయును. జీవితాన్ని భగవత్‌పరంగా గడపాలి. లేకున్నా అజ్ఞానములో వున్నట్లే లెక్క. ఈ క్షేత్రాన్ని ఉపయోగించుకొని, క్షేత్రజ్ఞుని శక్తి సామర్థ్యాలను దర్శించగలము. ఈ సాధన మార్గములో ప్రయాణించిన భగవత్ స్వరూపులమైపోగలము.

# శారదా స్తుతి

**"యాకుందేందుతుషారహార ధవళా యాశుభ్ర వస్త్రావృతా**
**యావీణావరదండమండితకరా, యాశ్వేతపద్మాసనా**
**యాబ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిర్దేవైస్సదాపూజితా**
**సామాంపాతు సరస్వతీ, భగవతీ, నిశ్శేష జాడ్యాపహా"**

-"ఆ తల్లి సరస్వతీదేవి మల్లెపువ్వులాగా, జాబిల్లిలాగా, మంచు బిందువుగా మాలికలాగా స్వచ్ఛమైన తెల్లని వర్ణం కలది. ఆ దేవి సదా వీణ చేతదాల్చి, తెల్లని వస్త్రాలు ధరించి, తెల్లపద్మం మీద ఆశీనురాలై ఉంటుంది. సృష్టికర్త బ్రహ్మలయకారుడు, శంకరుడు మొదలైన దేవతా శ్రేష్ఠులందరికీ వాగ్దేవి పూజ్యురాలే. అటువంటి తల్లి సరస్వతి. మనలో సహజంగా ఉన్న మాయను, జాడ్యాలను అన్నింటినీ తొలగింపజేయగల ఆ దేవి మనందరినీ రక్షించుగాక!"

# పని కోసం శరీరం

- "ఆదర్శపథం" నుండి

1949వ సంవత్సరం సంఘంపై నిషేధం తొలగించిన తరువాత దేశ మంతటా పెద్దఎత్తున కార్యక్రమాలు జరిగాయి. వాటిలో పాల్గొనడం పూర్తి అయిన తరువాత గురూజీ మాధవరావు గోళ్వాల్కర్‌జీ కొంతకాలం కాశీలో ఉన్నారు. ఆయన బాగా అలసిపోయారు. కొద్దిరోజులు విశ్రాంతి తీసుకుంటే బాగుంటుందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. అందువల్ల కార్యక్రమాలు ఏమి ఉన్నాయి? అని అడిగారు. అందరూ ఒకేసారి అన్నారు "మీరు పూర్తి విశ్రాంతి తీసుకోవాలి. అందువల్ల కార్యక్రమాలు ఏమీ లేవు". గురూజీ ఆ మాటలు వినగానే "అది సరికాదు. కార్యక్రమాలు తప్పక ఉండాలి" అన్నారు. మేము ఆయన మాటలు ఒప్పుకోలేదు. నగర కార్యవాహ శ్రీ బెనర్జీ "ఇప్పుడు మీరు మా ఆధీనంలో ఉన్నారు. మేము మీకు పూర్తిగా విశ్రాంతి ఇవ్వదల చాము. కార్యక్రమాలు ఏర్పాటు చేయలేదు" అన్నారు. రాత్రి గురూజీకి దగ్గు ఎక్కువైంది. మర్నాడు పొద్దునే మేము వెళ్ళి చూసేటప్పటికి గురూజీ ఆరోగ్యం ఏమాత్రం బాగలేదు. కళ్లు ఎర్రగా ఉన్నాయి. మేమందరం బాధపడ్డాము. బెనర్జీగారు 'గురూజీ! ఇదేమిటి ఇట్లా ఉన్నారు. మీరు పూర్తి విశ్రాంతిగా ఉంటే ఆరోగ్యం కుదుటపడుతుందనుకొన్నాము. ఇదేమిటి ఇట్లా అయింది?" అని ఆందోళనతో అడిగారు.

గురూజీ "డాక్టరుగారూ! ఇదంతా మీరందరూ కలసి చేసిన ఆలోచన ఫలితమే. పూర్తిగా విశ్రాంతి ఇస్తే శరీరం కోలుకుంటుందనుకొన్నారు. అది సరియైన ఆలోచన కాదు. నిజానికి ఈ శరీరంలో మిగిలి ఉన్న శక్తి అంటూ ఏమీ లేదు. డాక్టర్లు అంచనా ప్రకారం దీని పని ఎప్పుడో అయిపోయింది. పని అంటూ లేకుండాపోవడంతో అది తన సహజస్థితిని చూపుతోంది. నేను నిరంతరం సంఘకార్యంలో మునిగిఉండటంతో అది పనిచేస్తోంది. నేను బాగుండాలనుకుంటే మీరు ఎప్పటివలే కార్యక్రమాలు ఏర్పాటు చేయండి" అన్నారు. మేము అట్లాగే చేశాము. గురూజీ ఉత్సాహంతో







కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. క్రమంగా వారి ముఖంలో తేజస్సు వచ్చింది. రెండు, మూడు రోజుల్లో ఆయన మామూలు మనిషి అయినారు. మనిషి జీవనానికి జీవనకార్యానికి ఉన్న అవినాభావ సంబంధం అటువంటిది.

# మాతృసంస్థ కబుర్లు

హిందువుల పండుగలలో దీపావళి ప్రత్యేకమైంది. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండుగ జరుపుకుంటారనేది పురాణ ప్రాశస్త్యం. ఆశ్వయుజ అమావాస్య రోజునే దీపావళి పండుగ. దీపావళి పండుగ ముందురోజు ఆశ్వయుజ బహుళ చతుర్దశి. దీనిని నరక చతుర్దశిగా జరుపుకుంటారు. ఈ సంవత్సరం నవంబర్ 3, 4వ తేదీన వచ్చింది. సాయిధామంలో మందిరాలు, భవనాలు శుభ్రం చేసుకోవడం, అటకల మీద ఉన్న టపాకాయలు బూజు దులిపి ఎండబెట్టడం చేసారు పిల్లలు.

4వ తేదీ ఉదయం గం.6.00లకు ద్వారవతిలో బాబా వారికి క్షీరాభి షేకం, ప్రత్యేక అర్చనలు జరిగాయి.

సాయంత్రం ఆశ్రమంలో, సాయి దేవాలయంలో దీపాలంకరణ ఎంతో శోభాయమానంగా జరిగింది. దేవాలయాన్ని రంగురంగుల రంగ వల్లికలతో అలంకరించి, వాటి మధ్య దీపాలు కొత్తకాంతులతో సుందరంగా వెలిగాయి. సాయంత్రానికి గం.6.00లకు హారతి అనంతరం లక్ష్మీదేవి పూజ, పూజ్యగురుదేవుల పరమ గురువుల తిథి కావడంతో వారికి శ్రీశ్రీశ్రీ శ్రీరామానంద ప్రభుజీవారి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం టపాకాయలు ఆశ్రమవాసులంతా కాల్చి ఆనందించారు.

నవంబర్ 25వ తేదీన పూజ్య మాతాజీ 80వ జన్మదినం. ఆశ్రమమంత టికీ పండుగ. వారు భౌతికంగా మననుండి దూరమై ఆరేళ్ళు గడుస్తున్నా వారు లేని లోటు మాత్రం కలవరపెడుతున్నది. ఎందరో జీవితాల్లో వెలుగు

వాకిళ్లు నింపిన ప్రేమమూర్తి. ఇంకా ఆ జ్ఞానజ్యోతులు వెలగాలని 23, 24వ తేదీలలో పూజ్యమాతాజీ 80వ జన్మదినం సందర్భంగా బొమ్మల రామారంలోని పరిసర గ్రామ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు "అమ్మ చెప్పిన కమ్మని కథలు" పుస్తకాలను పంచడం జరిగింది. మొత్తం 14 పాఠశాలలకు పంచారు.

26వ తేదీ ఉదయ గం.6.00లకు స్ఫూర్తిధామంలోని పూజ్య మాతాజీ గారి పాలరాతి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, నూతన వస్త్రాలతో, పూల మాలలతో అందంగా అలంకరించారు. '80' సంఖ్య ఆకారంలో పుష్పాలతో, దీపాలతో అలంకరణ ఏర్పాటు చేశారు. దీపం జ్ఞానానికి గుర్తు. ఎన్నోవేల మందికి జ్ఞానభిక్షను పెట్టారు. గం.10.00లకు పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు పూజ్య మాతాజీ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని మాతాజీ గత కాలపు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. శ్రీశ్రీశ్రీ శ్రీరామానంద ప్రభుజీ వారు మాతాజీ త్యాగమయ జీవితాన్ని గూర్చి భక్తులకు, విద్యార్థులకు వివరించారు.

మధ్యాహ్నం గం.1.00లకు శ్రీ సాయి విద్యాధామం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో శ్రీశ్రీశ్రీ శ్రీరామానంద ప్రభుజీ వారు, ట్రస్టు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శ్రీశ్రీశ్రీ శ్రీరామానంద ప్రభుజీ వారు తల్లిదండ్రులను ఉద్దేశించి ఉపన్యసించారు. కరోనా కారణంగా పాఠశాలలో సంవత్సరన్నర కాలం మూతపడటం వలన పిల్లల్లో విచ్చలవిడితనం, సోమరితనం పెరిగిపోయింది. చదువుకోవాలనే ఆసక్తి చూపించడం లేదు. వారి వేషధారణలో మార్పులు వచ్చాయి. ఉచ్ఛారణలో మార్పులు వచ్చాయి. క్రమశిక్షణ అనేది లేకుండాపోయింది. కాబట్టి తల్లిదండ్రులుగా మీరు, ఉపాధ్యాయులు కలిసి పనిచేస్తేనే పిల్లలు సక్రమంగా ఉంటారని వివరించారు. వారికి అడిగినవన్నీ యివ్వాలనుకోకండి. బాధ్యతలను గుర్తుచేయండి. వారి భవిష్యత్తు ఎలా ఉండాలో దానికి సరిపడా జ్ఞానాన్ని అందించండి. తల్లిదండ్రులుగా మనము ఇవ్వాల్సినవి-సంస్కారం, ఆరోగ్యం, మంచి జ్ఞానాన్ని అందించ







మని బోధించారు.

మధ్యాహ్నం గం.2.00లకు పాఠశాల వార్షికోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమం : విద్యార్థులతో, తల్లిదండ్రులతో, కళ్యాణి ఆడిటోరియం అంతా కోలాహలంగా తయారయ్యింది. అందరిలో ఉత్సాహం, ఆనందం. విశ్వకళా పరిషత్ ఛైర్మన్‌గారైన శ్రీశ్రీశ్రీ శ్రీరామానంద ప్రభుజీ వారిని, ట్రస్టు సభ్యుల ఆహ్వానాలతో కార్యక్రమం ప్రారంభమయ్యింది. పాఠశాల కరస్పాండెంట్ గారైన శ్రీ డా॥ జి.చంద్రారెడ్డిగారు 30 సం.ల పాఠశాల గొప్పతనాన్ని, కష్ట నష్టాలను, ముఖ్యఉద్దేశ్యాలను వివరించారు.

ఇంత పెద్ద సంస్థ నడవాలంటే - అందరం కలిసికట్టుగా పనిచేయాలి. ఆశ్రమమే తన జీవితం. తనకంటూ వేరే జీవితం లేకుండా జీవిస్తున్న శ్రీశ్రీశ్రీ శ్రీరామానంద ప్రభుజీ వారి కృషికి మనమందరం సహకరించాలి. కానీ, విమర్శించటం తగదని, స్వార్థంగా బ్రతుకుతున్న సమాజంలో యిలాంటి నిస్వార్థ హృదయానికి మనమిచ్చే బహుమానం గొప్పగా ఉండాలని చెప్పారు. అనంతరం "అమ్మ చెప్పిన కమ్మని కథలు" పుస్తకావిష్కరణ జరిగింది. సాయంత్రం గం.4.00లకు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమైనాయి. ముందుగా అతిథులను ఆహ్వానించడం మన సాంప్రదాయం. కావున స్వాగతం-స్వాగతంతో ప్రారంభించారు. సమాజానికి మంచి సందేశాలినిచ్చే నాటకాలు, మనస్సుకు ఆనందాన్ని, ఉత్సాహానిచ్చే డాన్సులు, కోలాటాలు మొదలైనవన్నీ శ్రోతలందర్నీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా స్మృతిలహరి నాటకం, రామాయణం నాటకం, పిల్లల అభినయం చాలా చక్కగా వున్నాయని మెచ్చుకున్నారు.

అనంతరం శ్రీ సాయి విద్యాధామం పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన, రంగవల్లికలు, డ్రాయింగ్ వగైరా పోటీలు నిర్వహించి పూజ్య మాతాజీ పేరు మీద ట్రస్టు సభ్యుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరిగింది.

10వ తరగతిలో పాఠశాల ప్రథమస్థానంలో నిలిచిన చి॥ డి.ఆలేఖ్యకు మాతాజీ పేర కొంత నగదును, శాలువాను కప్పి సత్కరించారు.

**(మిగతా 4వ పేజీలో)**